


# 17 ఊసరవెల్లి కథ

"ఆ మాటా నిజవేనమకో" అన్నారు రామిరెడ్డిగారు పేపరు మడిచి పడేసి.

"ఏ మాటా?" అనలేదు సుబ్బరాజు.

"అదే. అందరూ దేస్సేవ జేస్తానంటే, ఇహ చేయించుకుందు కెవడుంటాడూ అని" అన్నారు రెడ్డిగారు.

"ఢిల్లీ సంగతా?"

"మరే జవహరీలాలుగారు కోప్పడుతున్నారు. ఇంతమందీ ఢిల్లీలోనూ హైద రాబాదులోనూ కూర్చుండి దేస్సేవ జేస్తానంటే ఎలాగయ్యా. చోటేది – మియ్యందరికీ బసలెక్కడ చూపించమంటారు. కొంతమంది దేశ మధ్యంలో ఉండండి అంటున్నారు... ఇప్పుడు మెంబరుగిరీ దేస్సేవకే ఇంత రద్దీ అయితే, ఇహ రేపు మినీస్టురిగిరీ మార్కు దేస్సేవ కెంతయ్యేనూ అని" అన్నారు రెడ్డిగారు.

"శానా ఉన్నాయిగా. సెంట్రలు దేస్సేవా, రాష్ట్రాల దేస్సేవా, మున్సిపాల్టీ దేస్సేవా, పంచాయితీ దేస్సేవా, కమిటీ దేస్సేవా, మళ్ళీ రెండో వరసలో డిప్యూటీ దేస్సేవా... సదురుకోవచ్చుగా" అన్నాడు సుబ్బరాజు నవ్వి.

"ఓ రబ్బో. నివ్వు కూడా జోకేశావే! నివ్వేటి, అయనెపుడూ – ఆ భోజరాజు మొహం జూస్తే కవిత్వం పుడద్దంటారు జూడు – అలాగా మినీస్టురి పేరు జెబితే పెతివోడికి హేళన. వెటకారం తన్నుకొస్తన్నాయి... అబ్బే నిన్ననాలని గాదు. ఊసొచ్చింది గదాని చెబతన్నా... మినీస్టరినగానే ఆడింక మనుసుల్లో జవఁగాదనీ, నిలకళ్ళేనాడనీ, ప్లేట్లు పెసరట్లలా తిరగేస్తాడనీ పెతివోడికీ కడుపులో ఊహ. ఇహనిం చాడి బతుకు బజార్న పడేస్తారు. రూపాయికి చిల్లర మార్చడం చేతగానోడు కూడా మినీస్టురిగారి తలకాయలు మార్చే ప్రగ్నె మీద విసుర్లే. నిజానికాడిదెంత గట్టి బుర్ర కాబోతే మినిస్టరియ్యాడు – అది చూడరు"

"ఎవరూ? అచ్చిరెడ్డి మాటేగా మీరు జెప్పేది" అన్నాడు సుబ్బరాజు నిదానంగా.

"అవును... మీకు ఈ పార్టీ టిక్కెట్టీకపోతే ఆ పార్టీలో కలుస్తారూ, నీతా నియమవాఁ నిలకడా" అన్నాట్ట... బుచ్చబ్బాయి కత దెలీదా అని అడిగించాలే. తగ్గాడు... నీకు దెల్సా అది? (అంటూ ఆ వైనం ఆరంభించారు రెడ్డిగారు) నాగరాజుగారి బుచ్చబ్బాయి మా గారంగా పెరిగాడు. రంగడి కుచ్చులా తిరిగాడు.

అయినా గడుసుదనం అబ్బింది. "ఏరా బుచ్చబ్బాయీ, నువ్వు అయ్యకొడుకువా? అమ్మ కొడుకువా?" అని అడిగితే, "అమ్మ కాడున్నప్పుడు అమ్మ కొడుకునీ, అయ్య దెగ్గరున్నప్పుడు అయ్య కొడుకునీని" అనేవాడు ఐదారేళ్ళపుడే. ఓ మారయ్యా, అమ్మా ఓ దగ్గిరుండి, ముద్దు చేసడిగారు. "మీ ఇద్దరి కొడుకునీని" అన్నాడు బుచ్చయ్య ముసిముసి నవ్వుల్నవ్వుతూ.

"బావా? ఇహ నాకు బెంగలేదు. నియ్యల్లుడు మినీస్ట్రివుతాడు, ఇండిపెండెం సొస్తే. ఇప్పణ్ణించి మంచి జేసుకో" అన్నాడు నాగరాజు కొడుకు వీపు దట్టి.

అదిగో, ఆ మాటే కాయవైంది. మినీస్టురి మినీస్ట్రిని అయనోళ్ళూ కానోళ్ళూ అంతా మేల మాడేవోరు బుచ్చబ్బాయిని చూసి. అడికీ మనసు రాజకీయాల కేసి మొగ్గింది. చదువుని ఓ రకంగా గట్టెక్కించేసరికి రంగంలో సందడైన కుర్రాడని పేరొచ్చింది. చిన్నప్పుడు అందరూ జేలుకెళ్తే నేనెందు కెళ్ళరాదని అల్లరి పెట్టేవాడు. డౌనన్నా జెయ్యన్నా అణ్ణెవరూ పట్టించుకోలేదు. డీయెస్పీగా రబ్బాయితో ఉన్న దోస్తీనిబట్టి అళ్ళింట్లో చనూగా దిరిగి, డీయస్పీగారితో జేలు చూట్టాని కెళ్ళి కాళీగా ఉన్న గదిలో కూర్చునేవాడు. ఆయన్నల్ల దొరగారేలే. నవ్వుకునేవోడు. దరిమిలాను ఏం తోచనపుడల్లా జేలుకేసి షికారెళ్ళి, కాళీగా ఉన్న గదిలో తలుపేసుకు పడుకుని చదూకునేవాడు. జేలు గదులు అద్దెలకిస్తున్నారనీ ఎవరో గిట్టనోళ్ళనడంతో అధికార్లకి మాటొచ్చి, బుచ్చబ్బాయికి జేలు సున్నా జెప్పారు. నేను జేలు కెళ్ళానంటూ ఉండేవాడు బుచ్చబ్బాయి. పెద్దాడై ఉజ్జోగంలో దిగే టంయివంయే సరికి రచ్చకెక్కిపోయాడు. అదెలాగనేవు - సొంతూళ్ళో వాళ్ళ పింతండ్రి పొలం నాలుగెకరాల చెక్కుండేది. శానా భాగం తెగనమ్ముకోగా మిగిలిన బాపతు. ఓ మోతుబరి ఆ చెక్కకి నాలుగెంపులా ఉన్న భూవులు పద్దానుగు మంది దగ్గిర నయానా బయానా క్రయంజేసి, కలుపుకున్నాడు. మజ్జిన లంకలాగా ఈ చెక్కుండిపోయింది. బుచ్చబ్బాయి పింతండ్రేమో అది అమ్మనుగా కమ్మనన్నాడు - ఎన్నందాల యాగీ పెట్టినా దిగి రాలేదు. మోతుబరి చౌదరిగారు బరితెగించి, నీ పనిలాగుందన్చెప్పి తన పొలమంతా పొగాకేయించేశాడు. వొరి జల్లుకున్న వీడు గొల్లుమన్నాడు. ఇంతటితో ఆపలేదు. లైసెన్సు కూడా తెచ్చుకుని, ఇక్కడిదే ఖాయం జేస్తా చూడమన్నాడు చౌదరి. అదిగో ఆ యవారంలో చేయి జేసుకుని పైమీద కండువా వేసుకుని చుట్టుప్రక్కల రైతాంగాన్ని కూడగట్టుకుని చెయ్యాల్సినంతా చేశాడు బుచ్చబ్బాయి. ఆ ఉద్యమంలోనే పెద్దర్ని చూశాడు. మినిస్టర్లతో మాటాడాడు. ఆ దెబ్బనే తీర్మానించుకున్నాడు - మనకి రైటైంది రాజకీయంవేనని.

వారం తిరక్కుండా ఊరి పెద్ద దగ్గిరకెళ్ళి తన ఉద్దేశం చెప్పి దారేవింటన్నాడు.

"బాబూ, ఇంకా చిన్నవాడివి. నీకిప్పుడే రాజకీయాలెందుకు? ముందు మీ యయ్య వ్యాపారం జూడు. పెళ్ళాడు. పిల్లల్ని కను, నాలుగు రూపాయిల్జేసుకో. జవ సత్వాలుండగా ఇవన్నీ కావాలి. ఆ వెనక, లౌక్యం నేర్చి ఇందులో కొద్దుగాని, ముందే వచ్చి దెబ్బతింటే ఎందునా పొందకుండా పోతావు" అన్నాడు పెద్ద.

బుచ్చబ్బాయి ససేమిరా అన్నాడు.

"సరే నువ్వే పార్టీ?" అన్నాడాయన.

"టీ పార్టీ" అన్నాడు బుచ్చబ్బాయి గడుసుదనం కనపడేలా నవ్వి.

పెద్దగారు, అతనికేసి ఓ రెప్పపాటుకాలం పరీక్షగా చూశాడు, చూసి నవ్వారు.

"లంగ రందేదాకా ఎటూ దేలకుండా గడుసుగా ఉండడం మంచిదేగాని, అదే మితిమీరితే, గడుసువాడి వన్న పేరే ఖాయమై పోతుంది. ఆనాకెవరూ నమ్మరు. ముద్దర్లిష్టం లేపోతే తేలిగ్గా వేసుకోవాల్తప్ప, అసలొద్దనరాదు. అలాటోళ్ళు మరీ జాగర్తగా ఉండాలి... సర్లే వెళ్లి కాంగ్రెసులో చేరు. నేను కబురంపిస్తాను" అన్నాడాయన.

ఇకనేం జెప్పమన్నావు? ఆయొక పార్టీలు కావు. ఆయొక గ్రూపులు గావు. బుచ్చబ్బాయి కాలి కింద చక్రం వుందనేవారు గిట్టనోళ్ళు. అంటేనేంగాక, మనిషెదరపడితే ఓహో అనే అనేవారు. అనాలనిపించేది. బుచ్చబ్బాయి ముఖారవింద వఁను, మాట చవత్కారవఁను, అదృష్టవఁను. ఇవిగాక, అసలు ప్రజాసేవ సరేసరి. కొంతకాలానికది అలవాటయిపోయింది. వెనకటికో దొంగాడి కథుంది చూడు – వాడిలాగే అపద్ధర్మంగా గతిలేక, బైరాగోడి వేషం వేసి ఓ గుళ్ళో ముక్కు మూసుక్కూచున్నాట్ట మూణ్ణాళ్లు. ఓ పూటయేసరి కింకేం తోచక, పోనీ వూరికినే కూర్చోడవేల... రాఁవా కుష్ణా అనుకుందాం కాలక్షేపానికి అని దొంగజపం మొదలెట్టాట్ట. మూణ్ణాళ్ళు అలా కానిచ్చేసరికి వాడికి మనసు మారిపోయి నిజంగానే భక్తుడై పోయాడు. ఇహ మళ్ళీ ఆ గుళ్ళోంచి లేచి పోలేదు. అల్లాగే బుచ్చబ్బాయి – చిన్నా పెద్దా ఎలక్షనిబట్టే అను, పార్టీ మారినపుడల్లా పాత పార్టీని దుమ్మెత్తి పొయ్యడానికే అను, ఉన్న పార్టీలో బలం పుంజుకుందుకే అను – మొత్తం మీద రోజు కిరవై నాలుగ్గంటలూ ప్రజలోయ్ ప్రజలు అని మొత్తుకోడంలో అది కొంత వంటబట్టిపోయింది. అతనే ఓసారన్నట్టు అదృష్టం బాగుండి వరదలూ, కరువులూ, జబ్బులూ వరప్రసాదాల్లా వొచ్చాయి. బుచ్చబ్బాయి నడుం కట్టి రాత్రింబవళ్ళు పన్చేశాడు. సమ్మెలు కట్టించాడు, ఇప్పించాడు. మున్సిపాల్టీలో రెండుసార్లు వెలిగి మళ్ళీ గెలవకపోయినా భయం లేదన్న ధీమాతో – జనవంతా మంచిపనీ, కావాలని చిరకాలంగా అనుకుంటున్న పనులు పదీ చకచక నడిపించాడు. తను పయ్యంతస్తు కెళ్ళడానికివి పెట్టుబళ్ళన్నమాట. అతనికి దప్ప అన్యుడికి తెలీదు. కాంగ్రెసు నుంచి లోక్ పార్టీ కెళ్లినా, ప్రజా పార్టీకెళ్ళినా, సోషలిస్టుల్లో కలిసినా, కమ్యూనిజం ఒప్పేసుకున్నా, మళ్ళీ మాజీ లోక్‌పార్టీ మెంబరు పోజుతో కాంగ్రెసులో కలిసినా, కీలకస్థానంలో ఉండేలా గ్రూపు కట్టినా, ఆ బాపతు పార్టీలో చేరినా, ఏం చేసినా అతనికి చెల్లింది. ఇయ్యన్నీ చెప్పడానికిలా అల్లిబిల్లి గారడీలా కనబడవచ్చు గాని, ఇందులో ఒక్కొక్కడుగూ ఎంతో నిదానంగా మెళకువ దెలిసి వేశాడు. అతను చెప్పినవన్నీ చేసి చూపించే వాడంటే నమ్మకం. కట్నాల్లేకుండా పెళ్లిళ్లు గావాలని ఓ మాటు స్పీచికొట్టాడు. నెల్లాళ్ళు దిరిగేవరకూ ఇంకో పెళ్లాడాడు – కట్నం లేకుండా. నీకిదేం బుద్ధయ్యా అంటే ఇదిగో ఇందుకూ అన్నాడు జంకుగొంకూ లేకుండా.

నిజంగా ప్రజల మేలు గోరేవాళ్ళంతా కమ్యూనిస్టులయ్యుంటారని ఎవరో అన్నప్పుడు కొన్నాళ్ళపాటు కాంగ్రెసు గుడ్డలు విడిచేశాడు. దరిమిలాను, కాంగ్రెసే కమ్యూనిజంలో కెళిపోతూందని ఎవరో, కమ్యూనిజవే కాంగ్రెసును తనలోకి లాగేస్తోందనిం కెవరో

అన్నప్పుడు అలాగయితే మనం కాంగ్రెసులోనే ఉంటే సరిపోద్దని ఖద్దరు చింపించాడు – పెద్ద స్టేటుమెంటిచ్చి.

మొత్తానికి చెప్పబోయిందేవిఁటే అంటే ఇలా దేశసేవ జేసుకుంటూ కొన్నాళ్ళకి బుచ్చబ్బాయి మంత్రి పదవి గాపోయినా మంచి పదవి గడించాడు. మరి కొన్నాళ్ళకి 'ఏక్ దిన్ కా సులతా'నన్నట్టు ఒకరోజు మంత్రి అవబోయినంత పన్జేశాడుగాని గిట్టనోళ్ళు గొడవబెట్టారు. బుచ్చబ్బాయి నిలకడలేని మనిషనీ, గంటకో టోపీ, పూటకో గ్రూపూ, రోజుకో పార్టీ, లక్ష్యం, ఆశయం రంగూ హంగూ మార్చేసే ఊసరవెల్లి అనీ విమర్శించారు. ఇలా ఊరందరికీ దెలిసిన ఊసరవెల్లిని మినీస్ట్రీలో వేసుకుంటే అపర్దిష్టన్నారు. వెంటనే బుచ్చబ్బాయి తనకి పదవులక్కర్లేదని చెప్పి పార్టీ మార్చేశాడనుకో – కొన్నాళ్ళగ్గానీ మళ్ళీ నిజమైన దేశసేవకుడి పదవి రాలేదు.

"నువ్వు జెప్పు సుబ్బరాజూ, పార్టీలే రంగులు మార్చేస్తున్న ఈ రోజుల్లో, కొన్ని పార్టీలు జుట్టుకోరంగు, మీసానికోరంగు, రాష్ట్రానికో రంగు, అవసరానికో హంగు మారుస్తున్న ఈ కాలంలో రంగు మీద రంగేస్తున్న పరిస్థితుల్లో బుచ్చబ్బాయి ఊసరవెల్లి అని తిట్టడం సబబే నంటావా?" అన్నాడు రెడ్డిగారు.

"తప్పే! అసలు బుచ్చబ్బాయి ఊసరవెల్లికాదు. అతన్ని పార్టీల, గ్రూపుల కళ్ళజోళ్ళతో చూసినవారే పొరబాటు పడ్డారు. మొదట్నించి చివరిదాకా బుచ్చబ్బాయి కోరిక మినిస్ట్రీవాలనే. అదే అతని పార్టీ, అదే పాలసీ, అదే ఆశయం. ఏ పార్టీలో ఉన్నా అతని మనసులోగాని, పద్ధతిలోగాని ఎన్నడూ మార్పులేదు. అంచేత అతను ఊసరవెల్లికాదు, అవసరాలనుబట్టే అతన్ని చేరదీసిన గ్రూపులూ, పార్టీలే ఊసరవెల్లులు" అన్నాడు సుబ్బరాజు.

★ ★ ★